www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 24 మే 2024

25న డివైఇఓ ఉద్యోగాలకు పరీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న డిప్యూటీ ఎడ్యుకేష నల్ ఆఫీసర్ల(డివైఇఓ) ఉద్యోగాలకు పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న ఉదయం 9 గంటల నుంచి ఉదయం 11:30 గంటల వరకు స్థానిక భట్లపాలెం బివిసి ఇంజినీరింగ్ కళాశాల నందు ఈ ఉద్యోగాలకు పరీక్ష నిర్వహిస్తారని అన్నారు. డిప్యూటీ ఎడ్యుకే షనల్ ఆఫీసర్ ఇన్ ఎపి ఎడ్యుకేషనల్ సర్వీసెస్ అభ్యర్థులు ఉదయం 7.30 గంటల నుంచి 8.15 గంటల వరకు పరీక్షా కేంద్రం లోకి అనుమతిస్తామన్నారు. ఆపై ఆలస్యంగా వచ్చిన వారిని గ్రేస్ పిరియడ్లో 8.30 గంటల వరకు అనుమతిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 180 మందికి ఒకే పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టినట్లు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అమరావతి నుంచి 26 జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు విడివిడిగా ఓట్ల లెక్కింపు ఏర్పాట్ల సన్నద్ధతపై జిల్లాల వారీగా సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల నందు స్ట్రాంగ్ రూములను మూడంచెల భద్రత నడుమ నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికా రుల ఉద్దేశించి మాట్లాడుతూ జూన్ నెల 4న శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల నందు ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లు పటిష్టం చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూములకు పక్కనే ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి అమలాపురం పార్లమెంటు, నియోజకవర్గం, అమలాపురం అసెంబ్లీ, ముమ్మిడి వరం అసెంబ్లీ, పి.గన్నవరం అసెంబ్లీ, రాజోలు అసెంబ్లీ, కొత్తపేట అసెంబ్లీ, మండపేట అసెంబ్లీ, రామచంద్రపురం అసెంబ్లీ స్థానాలకు వెరసి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఒక పార్లమెంటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, సంబంధించి ఇవిఎంలలో నిక్షిప్త మైన ఓట్లను లెక్కించనున్నారన్నారు. లెక్కింపునకు అనువుగా అన్ని రకాల ఏర్పాట్లు ఈనెల 25 నాటికి పూర్తి చేయాలన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ఓట్లను లెక్కిస్తారని తదుపరి ఉదయం 8 గంటల నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో ఓట్ల లెక్కింపు ప్రారం భమవుతుందన్నారు పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాలవారీగా వేర్వేరుగా ఓట్ల లెక్కింపు జరగనుందన్నారు. ఆర్ఓ, ఎఆర్ఓ పర్యవేక్ష ణలో ఓట్ల లెక్కింపు చేస్తారన్నాయరు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన పిదప ఇవిఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఓట్ల లెక్కింపు విధుల్లో జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొంటార న్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు గదిలో ఒక రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో ఒక ఎఆర్ఓ, గెజిటెడ్ హోదా కలిగిన ఒక కౌంటింగ్ సూపరింటెండెంట్, ఒక సహాయకుడు, ఒక మైక్రో అబ్జర్వర్, ఇవిఎంలను అందజేసేందుకు ఇద్దరు విఆర్ఓలను నియమించడంతో పాటుగా వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల తరపు న కౌంటింగ్ ఏజెంట్లు లెక్కింపు కేంద్రంలో ఉంటారన్నారు. ప్రతి రౌండ్ వారీగా ఫలితాలు వెల్లడిస్తారనిఆయన తెలిపారు. ఓట్లు లెక్కింపు ప్రక్రియలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించకూడదని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా సిబ్బందిని కేటాయించాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు . లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రం ప్రహరీ చుట్టూ వంద మీటర్లు వరకు బారికేడింగ్ ఏర్పాటు చేయా లని ఆదేశించారు. వంద మీటర్ల లోపలికి ఏ వాహనాన్ని అనుమ తించకూడదన్నారు. పార్కింగ్ ప్రదే శాలలోనే వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు. ప్రధాన ద్వారం వద్ద పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలన్నారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ముందుగానే కౌంటింగ్ ఏజెంట్లకు, అభ్యర్థులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని సూచించారు.ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున జూన్ 6వ తేదీ వరకు ఎటు వంటి ర్యాలీలు ఊరేగిం పులు నిర్వహించరాదని, బాణసంచా కాల్చేందుకు అనుమతి లేదని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా జెసి ఎస్.నుపూర్ అజయ్, రిటర్నింగ్ అధికారులు వి.మదన్ మోహన్‌రావు, ఎస్.సుధా సాగర్, జివివి సత్యనారాయణ, జి.కేశవర్ధన్‌రెడ్డి, డివిఎస్.ఎల్లారావు, డిఆర్‌డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, ఐసిడిఎస్ పీడీ ఝాన్సీ రాణి, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ టి.వైద్యనాథ్ శర్మ, ఎఓ సిహెచ్.వీరాంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా జెసి తదితరులు

ఏర్పాట్లు పూర్తి: ఆర్‌డిఒ

రామచంద్రపురం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును జూన్ 4న చేపడతారని దానికి సంబంధించిన ఏర్పాట్లు అన్ని పూర్తయ్యాయని రామచంద్రపురం ఎన్నికల అధికారి ఆర్‌డిఒ సుధా సాగర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల లెక్కింపుకు కాట్రేనికోన మండలంలోని చెయ్యేరు వద్ద గల శ్రీనివాస ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీ లో నిర్వహిస్తారని, దీనిలో గల స్వామి వివేకానంద బ్లాక్ లో లెక్కింపుకు 10 టేబుళ్లు ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ప్రతి టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్, సూపర్‌వైజర్, సహాయకులను నియమించామన్నారు. మొత్తం కౌంటింగ్ ప్రక్రియ 24 రౌండ్లలో పూర్తవుతుందని ఆయన తెలియజేశారు.

జల్లివారిపేటలో పోలీసుల తనిఖీ

14 మోటార్ సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసులు విస్తత తనిఖీలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా పట్టణంలోని జల్లి వారి పేట లో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ విధమైన ఆధారాలు లేని 14 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇక్కడ ప్రజలతో రామచంద్రపురం ఎస్ఐ సురేష్ బాబు మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ రోజున ఎటువంటి ఘర్షణలో లేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నడుచుకోవాలని స్థానికేతర్లు అపరిచితులు ఎవరైనా ఇక్కడ నివాసం ఉంటే తమకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్ బాబు

బాణసంచా కాల్పులు, విక్రయాలు నిషేధం

ప్రజాశక్తి-ఆలమూరు

ఎన్నికల ప్రక్రియలో భాగంగా కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు బాణసంచా క్రయవిక్రయాలు, కాల్పులతో పాటుగా లూజు పెట్రోల్ అమ్మకాలు నిషేధించారని ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ అన్నారు. మండల కేంద్రం లోని పోలీస్ స్టేషన్లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగాయన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియాలో పార్టీలను, వ్యక్తులను ఆధారంగా చేసుకుని రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపైనా చర్యలు ఉంటాయ న్నారు. అదేవిధంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెట్రోలు బంకుల్లో లూజు అమ్మకాలు నిషేధించా రన్నారు. ఈ నిబంధనను ఎవరైనా అతిక్ర మిస్తే చర్యలు తప్పవన్నారు. బాణాసంచా విక్రయా లపైన కూడా నియంత్రణ ఉందని, బాణాసంచా అమ్మకదారులు నిబంధనలను పాటించకపోతే వారి పైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.


ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్

ప్రమాదం అంచున ప్రయాణం

- కోతకు గురైన రహదారి
- చర్యలు తీసుకోవాలని ప్రయాణికుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఊబలంక నుంచి ర్యాలీ వెళ్లే ఆర్ అండ్ బి రహదారి దుర్గమ్మ గుడి మలుపు వద్ద మేజర్ డ్రయినేజీ చెంతనే. రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పిం చబోయి అంకంపాలెం చెందిన ఒక వ్యక్తి మురుగు డ్రెయినేజీకి దూసు కుపోయాడు. కాలువ లో నీరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది . ఇది జరిగి సుమారు 6 నెలలు కావస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా పెట్టలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి తృటిలో స్కూటీపై వస్తున్న ఇద్దరు మహిళలకు గురు వారం ప్రమాదం తప్పి ంది. ఇప్పట ికైనా ఉన్నతాధి కారులు స్పందించి కోతకు గురైన రోడ్డును వెంటనే పనులు చేపట్టి ప్రయాణి కులకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలని పలువురు కోరుకుంటున్నారు.


ప్రమాదకరంగా ఉన్న ర్యాలీ రోడ్డు

కౌంటింగ్ కోసం టేబుళ్లు ఏర్పాటు

ప్రజాశక్తి-అమలాపురం

జూన్ 4వ తేదీన కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సంబంధించి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 7 అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ఏర్పాటు చేసిన టేబుళ్ల వివరాలు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గానికి 10 టేబుళ్లు పార్లమెంట్ నియోజకవర్గానికి 10 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. పి గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాని కి సంబంధించి అసెంబ్లీకి 12 టేబుళ్లు, పార్లమెంట్కు 12 టేబుళ్లు ఏర్పాటు చేశారు. రాజోలు అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి అసెంబ్లీకి 14 టేబుళ్లు, పార్లమెంట్కు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ముమ్మి డివరం అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి అసెంబ్లీకి 14 టేబుళ్లు, పార్లమెంట్‌కు 14 టేబుళ్ల లను ఏర్పాటు చేశామని అన్నారు. కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీకి 14 టేబుళ్లు, పార్లమెంటుకు 10 టేబుళ్లు ఏర్పాటు చేశారు. అమలా పురం అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి అసెంబ్లీ 14 టేబుళ్లు, పార్లమెంటు కు 12 టేబుళ్లను, మండపేట అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి అసెంబ్లీకి 10 టేబుళ్లను, పార్లమెంటుకు 10 టేబుళ్లను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.

నత్తనడకన జలజీవన్ మిషన్ పనులు


రాళ్లగుంట గ్రామానికి వేస్తున్న మంచినీటి పైప్‌లైన్

ప్రజాశక్తి-రామచంద్రపురం

గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ పరిశుభ్రతమైన రక్షిత మంచినీరు అందించాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2019లో జల జీవన్ మిషన్ అనే పథకాన్ని రూపొందించింది. దీనిలో భాగంగా ప్రతి ఇంటకీ తాగునీటి కొళాయి కనెక్షన్ ఉచితంగా అందజేసి ప్రజలందరికీ స్వచ్ఛమైన నీరు అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. దీనికోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు నిధులు మంజూరు చేసి 2011లో పనులు ప్రారంభించారు. జలజీవన్ మిషన్ 11వ భాగంగా ఆయా గ్రామ పంచాయతీలకు అవసరమైన నిధులు ఒక్కొక్క గ్రామానికి 20 నుంచి రూ.40 లక్షల వరకు మంజూరు చేశారు. అయితే మూడేళ్లుగా ఈ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. నేటికీ కె.గంగవరం మండలంలోని పలు గ్రామాలు మంచినీటి సమస్యతో కొట్టుమిట్టాడుతున్నాయి. మండలంలోని ఎర్ర పోతవరం గ్రామంలో గత రెండేళ్ళ గా మంచినీళ్ల ట్యాంకు పనిచేయడం లేదు దీనికి కలుషితం కావడంతో పాటు పైపులైన్లు మోటార్లు పాడవడంతో రెండేళ్లుగా గ్రామస్తులకు మంచినీళ్లు అందని పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా మండలంలో శివర ప్రాంతాలకు బట్లపాలిక, తమ్మాయపాలెం, కె.మల్లవరం, అద్దంపల్లి, తామరపల్లి, పాతకోట గ్రామాల్లోనూ ప్రతి ఏటా వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో పాటుగా మండల కేంద్రమైన కె.గంగవరంలో తాగునీటి సమస్య వేధిస్తుంది. ఎక్కడ కలుషితమైన మంచినీరు సరఫరా అవుతుంది అని రొయ్యల చెరువుల వల్ల మంచినీరు కాలుష్యం అయిందని వెంటనే రొయ్యల చెరువులు తొలగించి అందరికీ మంచినీరు అందించాలని ఇటీవల గ్రామస్తులంతా తహశీల్దార్‌ను వేడుకున్నారు. అదేవిధంగా తామరపల్లిలోనూ ఉదయం ఒక గంట మాత్రమే తాగునీరు సరఫరా అవుతుంది అని, తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు పలుమార్లు ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సుందరపల్లి ఊడిమూడి గ్రామాల్లోనూ తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. జలజీవన్ మిషన్లో ఆయా గ్రామాల్లో పనులు ప్రారంభమైన పూర్తిగా మంచినీటి కొళాయిలు బిగించకపోవడంతో పూర్తిగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేదు. ఇంకా అనేక గ్రామాల్లో మంచినీటి కుళాయిలు ఇళ్ల వద్ద బిగించాల్సి ఉంది. రాళ్లగుంట గ్రామానికి పైపులైను వేయాల్సిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా గ్రామాల్లో పూర్తిగా ఇంటింటికీ కుళాయిలు బిగించి రక్షిత మంచినీటిని అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

2 ఏళ్లగా పనిచేయని ఎర్రపోతవరం వాటర్ ట్యాంక్


ఎర్ర పోతవరంలో రెండేళ్లుగా పనిచేయని వాటర్‌ట్యాంక్

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం, ఎక్కడైనా సరఫరా ఆగితే ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాము. 2021-22 వచ్చిన 52 వర్క్స్‌లో 44 పూర్తయ్యాయి. 2023-24 వచ్చిన 35 వర్కులకు 2025 జూలై వరకు సమయం ఉంది. కాంట్రాక్టర్లు ప్రస్తుతం ఎన్నికల వలన అదేవిధంగా చేసిన బిల్స్ ,పేమెంట్స్ పెండింగ్ ఉండటంతో ఒక నెల వర్క్ ఆగిందని మళ్లీ వచ్చే నెలలో పనులు మొదలు పెడతామన్నారు.ఎర్ర పోతవరం లోను పనులు చివరి దశకు చేరుకున్నాయని పూర్తయిన వెంటనే మంచినీటి సరఫరా పునరుద్ధరిస్తాము. **-రామకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్, ఎఇ**

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో పలుచోట్ల గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలు, యోగ తదితర అంశాలను పలువురు వివరించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆత్రేయపురం: విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్రేయపురం శాఖ గ్రంథాలయ అధికారి తమ్మ నమ్మ శివాయ అన్నారు. గురువారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు యోగ, ప్రాణాయామం వల్ల కలిగే ప్రయోజనాలు, ఆంగ్ల సామెతల గురించి గ్రంథాలయ అధికారి విద్యార్థులకు వివరించారు అలాగే నీతి కథలు, దేశభక్తి గీతాలు, పద్యాలు విద్యార్థులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మరియు ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** పుస్తక పఠనముతో విద్యార్థులు తమ సృజనాత్మకతను పెంపొంది ంచుకోవచ్చు అని గ్రంథాలయ నిర్వహకులు ఎకెవిఆర్.సూర్య నారాయణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగముగా గురువారం విద్యార్థులకు జ్ఞాపకశక్తి పుస్తకం చదివించి పలు సూచనలు చేశారు. ఖాళీ సమయంలో పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బిడిసి ఎరుబండి కన్నబాబు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో విద్యార్థుల పుస్తకపఠనం


మామిడికుదురులో వేసవి విజ్ఞాన శిబిరం

అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

ప్రజాశక్తి ఆత్రేయపురం

కోనసీమ తిరుమల గా ప్రసిద్ధిగాంచిన భూదేవి, శ్రీదేవి సమేత వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న వకుళ అన్నదాన భవన నిర్మాణానికి గురువారం పలువురు విరాళాలు సమర్పించారు. రాజమహేంద్రవరం చెందిన సిరిగిరి జగన్నాథరావు, రాధ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.51,116, అలాగే భీమవరానికి చెందిన తోట మురళీ మోహన్, వారి కుటుంబ సభ్యులు రూ.14 వేలను ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్‌కు అందజేశారు. వీరికి స్వామివారి దర్శనానంతరం తీర్థప్రసాదలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఆలయ అభివద్ధికి సహరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



వెంకన్నను దర్శించుకున్న ఎంపీ రఘురామ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పర్యటనలో భాగంగా నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు గురువారం రావులపాలెం వచ్చారు. ఆయనకు రావులపాలెంలో టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆత్రేయపురం మండలంలో వాడపల్లి వెంకటేశ్వరస్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు అనంతరం ఆత్రేయపురం మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు ఇంటి వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి, బిజెపి, జనసేనల కూటమి ఆంధ్రప్రదేశ్లో అధికరణకు వస్తుందని ఆయన అన్నారు. **కొత్తపేట:** నర్సాపురం ఎంపీ రఘు రామ కృష్ణంరాజుకు కొత్తపేట సెంటర్ లో పలువురు టిడిపి నాయకులు ఘన స్వాగతం పూలమాలతో సత్కరించారు.

సమాజం పట్ల విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -మామిడికుదురు

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు వల్ల విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన పెరుగుతుందని మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డివివి.సత్య నారాయణ అన్నారు. మామిడికుదురు, పిగన్నవరం మండలాల్లోని అప్పనపల్లి, ఆదుర్రు, లంకల గన్నవరం గ్రామాల్లో దీప్తి డిగ్రీ కళాశాలకు చెందిన సెకండ్ సెమిస్టరు విద్యార్థులు గురువారం కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ పేరుతో సామాజిక సర్వే చేపట్టారు. ఈ సర్వే ను ప్రారంభించిన ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఇలాంటి సర్వే లు చేయడం వల్ల విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెరగడమే కాకుండా ప్రజల జీవన శైలి తెలుస్తుందన్నారు. ఆ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, భౌతిక శాస్త్ర, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ విజయ్ సత్య ప్రసాద్ యర్రంశెట్టి పర్యవేక్షణలో విద్యార్థులు సమూహాలుగా ఏర్పడి గ్రామాల్లో సర్వే చేశారు. ఇంటింటికీ తిరుగుతూ, ప్రజల సమస్యలను తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే ఆరోగ్యం, స్వచ్ఛత, అక్షరాస్యత పట్ల చైతన్యం కలిగించారు. బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలకు పంపాలని పలువురు తల్లిదండ్రులకు చైతన్యం కల్పించారు. వేసవిలో తీసుకోవా ల్సిన ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశారు. సామాజిక రుగ్మతలను తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో బిఎస్‌సి ఆనర్స్ కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

పంటబోదెలో పడిన ఆవు

రక్షించిన యువకులు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ప్రమాదవశాత్తు పంట బోదెలో పడి బురదలో ఇరుక్కుపోయిన ఆవును యువకులు రక్షించారు. చల్లపల్లి పంచాయతీ శీర గ్రామమైన వాసాలతిప్పలో గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రామంలో తిరిగే ఆవు పంట బోదె గట్టుపై గడ్డి మేస్తూ మధ్యాహ్నం పంట బోదె లో పడి ఊబిలో ఇరుక్కుపోయింది. గమనించిన స్థానిక అగ్నికుల క్షత్రియ యువకులు అతి కష్టంపై ఆవును సురక్షితంగా గట్టుకు చేర్చారు. అనంతరం పశు వైద్యాధికారి కె.రామారావు కు సమాచారం అందించడంతో రామారావు ఆయన సహాయకుడు గాంధీలు వచ్చి ఆవుకు తక్షణ వైద్యం అందించారు.ఆవును రక్షించిన యువకులను గ్రామస్తులు అభినందించారు.

నూకాంబిక హుండీల ఆదాయం రూ.21.29 లక్షలు

ప్రజాశక్తి-ఆలమూరు

చింతలూరు నూకాంబికా అమ్మవారి దేవస్థానం నందు వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా హుండీల ఆదాయం 35 రోజులకు గాను రూ.21,29,106 వచ్చినట్లు ఆలయ ఇఓ ఎమ్ ఎస్ఆర్.కృష్ణ గురువారం తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ రామచంద్రపురం డివిజన్ తనిఖీ అధికారి బాలాజీ రాంప్రసాద్ సమక్షంలో, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ అధికారుల పర్యవేక్షణ, గ్రామస్తుల సహకారంతో లెక్కింపు నిర్వహించామని రఇఓ తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ శ్రీనివాస్, అటెండర్ వీరన్న పాల్గొన్నారు.


హుండీల ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

సాయుధ బలగాల 'మాక్‌డ్రిల్'

ప్రజాశక్తి -అమలాపురం

జిల్లా ఎస్‌పి ఎస్.శ్రీధర్ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు భద్రత దృష్ట్యా ముందు జాగ్రత్తలలో భాగంగా ప్రజలకు అవగాహన కొరకు స్థానిక గడియార స్తంభం సెంటర్లో గురువారం జిల్లా పోలీస్ యంత్రంగం సాయుధ బలగాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ డే రోజున జిల్లాలో సంఘ విద్రోహక శక్తులు, అల్లరి మూకలు ఏవైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే అలాంటి వారిపట్ల పోలీసులు తీసుకొను చర్యల విధానాన్ని తెలియజేయడమే కాకుండా, ఏ పరిస్థితులనైనా ఎదుర్కొనేలా సిబ్బంది అందరినీ సమాయత్తము చేయ డమే మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశ్యమని ఎస్‌పి తెలిపారు.


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

వేడి చేసి చల్లార్చిన నీరు తాగాలి: కమిషనర్

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీ నుంచి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని వేడి చేసి తాగాలని కమిషనర్ జాస్తి రామారావు తెలిపారు. గురువారం వేసవి జలాశయం, ఫిల్టర్ బెడ్‌లను ఆయన పరిశీలించారు. గత 20 రోజులుగా కుళాయిల్లో పసరు రంగులో తాగునీరు సరఫరా అవుతోంది. దీనిపై మీడియా లోనూ కథనాలు వచ్చాయి. దీంతో స్థానిక ఉండూరు రోడ్డులోని ఫిల్టర్ బెడ్ చెరువును, ఫిల్టర్ బెడ్ పనితీరును కమిషనర్, మున్సిపల్ ఎఇ, ఇతర అధికారులు పరిశీలించారు. ఫిల్టర్ బెడ్ చెరువులో పసరు రంగులో ఉన్న జలాలను వారు పరిశీలించారు. అలాగే ఆ జలాలను శుద్ధిచేసే పద్ధతిని అధికారులు పరిశీలించి జలాలలో కలుపుతున్న ఆలమ్, క్లోరిన్ శాతాలపై సిబ్బందిని ప్రశ్నించి వారికి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కమీషనర్ రామారావు మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో జలాలు ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో నాచుపట్టి పసరు రంగులోకి మారినట్టు చెప్పారు. ఫిల్టర్ బెడ్ వద్ద అవసరానికి మించి ఆలమ్, క్లోరిన్‌లు ఉన్నప్పటికీ పరిమితిని మించి అధికంగా వాటిని వినియోగిస్తే ఆ నీరు త్రాగే ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదముందన్నారు. నీటిని ఎంత శుద్ధిచేసినా పసరు కొంచెం ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు కుళాయిల్లో వచ్చే నీటిని కొద్ది రోజులపాటు కాచి, చల్లార్చి తాగాలని ఆయన సూచించారు.


తాగునీటిని శుద్ధిచేసే ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్

వృథాగా పోతున్న తాగునీరు

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రజల అవసరాల కోసం సరఫరా చేస్తున్న తాగునీరు వృధాగా పోతుంది. గత కొన్ని రోజులుగా ఈ తంతు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. మండలంలోని గోవిందపురం గ్రామంలో బావవరం వద్ద ఏలేరు నీటిని శుద్ధి చేసి మండలంలోని అన్ని గ్రామాలకు పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. గోవిందపురం గ్రామానికి వెళ్ళే పైపు లైన్ లీకు అవుతూ నీరు ఉవ్వెత్తున ఎగసి పడుతుంది. దీంతో ఆ రహదారిలో ప్రయాణించే వారు ఆ నీటితో తడిచి ముద్ద అవుతున్నారు. ఇలా ఫిల్టర్ వాటర్ పైపు లైన్ గ్రామ మొదట్లో లీకు అవ్వడంతో గోవిందపురం గ్రామానికి నీరు అందడం లేదు. పైపులైన్ నిర్వహణ కాంట్రాక్టర్ లీకులు అరికట్టక పోవడంతో నీరు సరిపోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం ప్రజలు సంబంధిత అధికారులకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఫలితం ఉండటం లేదు. అధికారులు స్పందించి పైపులైన్‌కు శాశ్వత మరమ్మతులు చేపట్టి గోవిందపురం గ్రామానికి పూర్తి స్థాయిలో తాగునీటిని అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


పైపు నుంచి లీక్ అవుతున్న తాగునీరు

నేరాలు ఘోరాలు

మోసం కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

ప్రజాశక్తి - కాకినాడ

చిట్ కట్టించుకుని తిరిగి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన ఇద్దరు నిందితులకు మూడేళ్ళ కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి గురువారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే 2016లో కాకినాడ అపోలో ఆసుపత్రి దగ్గరలో దుర్గా రాధిక చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో బ్రాంచ్ నడిపిన పైలా నాగేశ్వర రావు, పైలా పవన్‌కుమార్ జగన్నాధపురానికి చెందిన కాళే సత్యవీరలక్ష్మికి రూ.10 లక్షల చిట్ వాయిదాల రూపంలో కట్టించుకున్నారు. అన్ని వాయిదాలూ కట్టాక ఆమెకు చిట్ డబ్బులు ఇవ్వకుండా మోసం చేయడంతో బాధితురాలు, పైలా పవన్ కుమార్‌లపై ఆమె టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం ముద్దాయిలను అరెస్టు చేసి చార్జిషీట్‌ను దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం కాకినాడ రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావడంతో మూడేళ్ళ కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ పిపి జి.కమలకుమారి వాదనలు వినిపించారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని శీల గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో తాటాకు ఇల్లు దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక అధికారి వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన లక్ష్మీకాంతం తాటాకు ఇంటిలో నివసిస్తుంది. గురువారం ఉదయం లక్ష్మీకాంతం ఉపాధి పనికి వెళ్లిపోయింది. ఉదయం 7 గంటల సమయంలో లక్ష్మీకాంతం ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు ఆ మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయినా ఆమె తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలో రూ.40 వేల నగదుతోపాటు కాసు బంగారం, ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైందని, నష్టం రూ.1.50 లక్షలు వరకూ ఉంటుందని విఆర్ఒ వీరభద్రరావు తెలిపారు.

కాలువలో మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని రౌతులపూడి సమీపంలో ఉన్న ఏలేరు ఎడమ కాలవ వద్ద గురువారం మృతదేహం లభించింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన సికోలు వీరబాబు(38) బుధవారం తన స్నేహితులతో ఓ వివాహానికి హాజరై తిరిగి ప్రయాణంలో ఏలేరు కాలువలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ తన సిబ్బందితో గాలించగా గురువారం మృత దేహాన్ని ఏలేరు కాలువలో గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ప్రమాదంలో బస్సు అద్దాలు పగిలిపోయిన దృశ్యం

ఆర్‌టిసి బస్సు, ట్రాక్టర్ ఢీ

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆర్‌టిసి బస్సు, ట్రాక్టర్ ఢీకొట్టు కున్నాయి. గురువారం ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కుడి వైపునకు తిరుగుతున్న బస్సుకు పెద్దాపురం వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ రోడ్డు మధ్య లో అడ్డుగా రావడంతో రెండు వాహనాలు ఢీ కొట్టు కున్నాయి. ప్రమాదంలో బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి.

పత్రాలు సరిలేని 5 బైకులు సీజ్

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కాకరపర్రులో గురు వారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా 5 బైకులను పత్రాలు సరిగ్గాలేని కారణంగా సీజ్ చేసినట్టు ఎస్ఐ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, పత్రాలు లేని వాహనాలను వినియోగించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

పురుగుల మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

పురుగుల మందు తాగిన యువకుడు కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఈనెల 18వ తేదీన రామచంద్ర పురం గ్రామానికి చెందిన పెనుగుల అబ్బులు(27) అదే గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అపస్మారక పరిస్థితిలో పడి పోయి ఉన్నాడు. స్థానికులు గుర్తించి పురు గుల మందు తాగాడని గుర్తించి అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం రాజహేంద్రవరం ప్రభుత్వాసు పత్రికి తరలించారు. అయితే మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజులుగా చికిత్స పొందుతున్న ఆ యువకుడి ఆరోగ్యం విషమించి గురువారం మృతి చెందాడు. పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

నాటు సారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - దేవరపల్లి

ఎస్ఐబి దేవరపల్లి స్టేషన్ పరిధిలో గురువారం మండలంలోని యాదవోలు గ్రామం లో చేసిన దాడిలో 20 లీటర్ల నాటుసారా తోపాటు ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ కెవి.స్వామి తెలిపారు. ఈ దాడు ల్లో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

100 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి. - కడియం

మండలంలోని మాధవ రాయుడుపాలెం గ్రామ శివారు చైతన్యనగర్ రైల్వే గేట్ దగ్గర్లో అక్రమంగా నాటు సారా రవాణా చేస్తున్న కొప్పిశెట్టి రామకృష్ణను అరెస్టు చేసినట్లు కడియం పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి 100 లీటర్ల నాటు సారా, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి, కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా కోడిపందాలు, పేకాటలు, సారాయి, మద్యం అమ్మకాలు, సారాయి తయారు చేసిన, అలాగే ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువకుడి మృతిపై అనుమానాస్పద కేసు నమోదు

ప్రజాశకి - ఆత్రేయపురం

ఒక యువకుడి అనుమానస్పద మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని వెలిచేరు గ్రామానికి చెందిన కైరం నాగ శ్రీనివాస్‌కు(34) వివాహం కాలేదు. తన తండ్రి పోతురాజుతో కలిసి ప్రతి రోజు పొలం పనులు చేసుకుంటూ తిరిగి వస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఎప్పటిలాగే పొలం పనులు చేసుకుని ఇంటికి వచ్చారు. అనంతరం తనొక్కడే తిరిగి అదే రోజు రాత్రి బయటకు వెళ్లాడు. ఎంతకూ రాకపోవడంతో తల్లి ఆ యువకుడికి ఫోన్ చేశారు. ఇంటికి వచ్చేస్తానని సమాధానం చెప్పాడు. అయితే ఇంటికి మాత్రం రాలేదు. తెల్లవారి గురువారం ఉదయం తండ్రి పోతురాజు పొలం పనులకు వెళుతుండగా గ్రామ శివారున తన కొడుకును స్పృహ లేకుండా పడి ఉండడం చూసి గ్రామ పిఎంపి వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించాడు. తన కుమారుడు శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకునే వాడు కాదని ఎవరో తన కుమారుడిని హతమార్చి ఉంటారని అతని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ ఎస్ శ్రీనివాస్ అమలాపురం నుంచి డాగ్ స్క్వాడ్, క్లూ టీమ్స్ రప్పించి పలు ఆధారాలను సేకరించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పెద్దాపురంలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో రూ.25 వేల విలువ చేసే నిత్యావసర వస్తువులను పంపిణీ జరిగింది. ఆదిత్య కళాశాల విద్యార్థులు తమ తమ గృహాల నుంచి బియ్యాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సెలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఈ విధమైన సేవా కార్యక్రమంలో భాగస్వాములు అవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒలు బి.రాంబాబు, ఐవి.వీరాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆశ్రమం వద్ద సరుకులు అందిస్తున్న విద్యార్థులు

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షునికి ఘన సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రముఖ న్యాయవాది కొర్లమండ వీరభద్రరావు సాధించిన హ్యాట్రిక్ విజయం సామర్లకోట పట్టణానికే తలమానీకం అని పలువురు వక్తలు అన్నారు. బుధవారం రాత్రి సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మూడోసారి కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా విజయం సాధించిన ప్రముఖ న్యాయవాది కొర్లమండ వీరభద్రరావు, శ్రీవాణి దంపతులకు ఆత్మీయ అభినందన కార్యక్రమం జరిగింది. లయన్స్ అధ్యక్షులు కానుబోయిన విజయ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా ప్రెసిడెంట్ చిత్తులూరి వీర్రాజు, సినీ దర్శకులు కెబి.ఆనంద్ మాట్లాడారు. ప్రజా సేవలో ఎల్లవేళలా ముందుండి అవసరాల్లో ఉన్న వారికి చేదోడుగా ఉంటున్న న్యాయవాదులు కొర్లమండ దంపతుల సేవలు అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో అసోసియేషన్ అధ్యక్ష పదవిని అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. సన్మానగ్రహీత వీరభద్రరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశీస్సులు, జీవిత భాగస్వామి, కుటుంబం సహకారంతో తాను ఇప్పటి వరకూ ఎన్నో విజయాలు, సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. ఈ సందర్భంగా వీరభద్రరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కార్యదర్శి బడుగు సీతా రామరాజు, నాయకులు మేకా శ్రీనివాస్, సేపేని సురేష్, కర్రి ఆదినారాయణ రెడ్డి, గుండు శంకర రావు, ప్రత్తి రామ లక్ష్మణమూర్తి, అందుగుల జార్జిచక్రవర్తి పాల్గొన్నారు.


వీరభద్రరావు దంపతులకు సత్కారం చేస్తున్న అభిమానులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డిఇ రత్నాలరావు తెలిపారు. 11కెవి సూరంపాలెం ఫీడర్, సూరంపాలెం ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతులతోపాటు, 11కెవి లైన్‌పై ఉన్న చెట్లు కొమ్మలను తొలగించడం జరుగుతుందన్నారు. కావున శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సూరంపాలెం, రామేశ్వరంపేట యర్రంపాలెం గ్రామాలతోపాటు, సూరంపాలెం అగ్రికల్చర్ బోర్లు, సూరంపాలెం పరిశ్రమలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన వెల్లడించారు.

ర్యాలీలు, బాణసంచా పేలుళ్లు నిషేదం

ప్రజాశక్తి - గండేపల్లి

ఎన్నికల కోడ్ ఉన్నందున కౌంటింగ్ పూర్తయ్యేంతవరకు ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు, బాణాసంచా పేలుళ్లను నిషేధించినట్లు సిఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో ఆయన పర్యటించి గ్రామ పెద్దలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం గండేపల్లి గ్రామ శివారు రంగంపేట పోవు రోడ్డులో ఉన్న ఆర్కాఫైర్ వర్క్సును సందర్శించారు. ప్రస్తుతం 144, సెక్షన్ 30 అమలులో ఉందని, జూన్ 6వ తేదీ వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ర్యాలీలకు అనుమతులు లేవన్నారు.


అనుమతి పత్రాలను పరిశీలిస్తున్న సిఐ

బిసిసిఐ కృషి అభినందనీయం

ప్రజాశక్తి - గండేపల్లి

పర్యావరణ పరిరక్షణ కోసం బిసిసిఐ చేస్తున్న కృషి అభినందనీయమని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మీడియా మేనేజర్, జాతీయ పర్యావరణ మిత్ర గంగాధర్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఐపిఎల్-24 క్రికెట్ టోర్నీ ప్లే ఆఫ్‌లో ప్రతీ డాట్ బాల్‌కి 500 మొక్కలు నాటడానికి నిర్ణయం స్వాగతనీయమని అన్నారు. ఐపిఎల్ ద్వారా ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలనే పిలుపు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాలని అన్నారు. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆయన కోరారు.

కౌంటింగ్ నిర్వహణకు సహకరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

జెఎన్‌టియులో జూన్ 4న జరిగే పెద్దాపురం నియోజకవర్గ కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్‌ఒ జె.సీతారామారావు కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, వారి కౌంటింగ్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేశారన్నారు. 15 రౌండ్లు కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కార్యాలయం ఎఒ సుబ్రహ్మణ్యం, పెద్దాపురం, సామర్లకోట తహశీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ కమిషనర్లు పద్మావతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'రోడ్లపై చెత్త వేస్తే జరిమానా'

ప్రజాశక్తి - కాకినాడ

చెత్తను రోడ్లపై వేస్తే జరిమానా తప్పదని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు హెచ్చరించారు. గురువారం ఆయన ఎంహెచ్‌ఒ డాక్టర్ పృథ్వీచరణ్‌తో కలిసి నగరంలో జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు. అలాగే ఇంటింటికి చెత్త, తడి పొడి చెత్త సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పూడికతీత పనులను వేగవంతం చేశామన్నారు. వర్షాలు పడే లోపుగా ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. డీ-సిల్టేషన్ పనులను పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రజల సహకారం కూడా ఉన్నప్పుడే మెరుగైన పారిశుధ్య సేవలు అందించగలమని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిసి కెమేరాల ఏర్పాటు

రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎన్.తేజ్ భరత్


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.తేజ్‌భరత్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్ట్రాంగ్ ల వద్ద రెండు సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటినీ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఎన్.తేజ్ భరత్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్ల పై రాజకీయ పార్టీల, అభ్యర్థుల రెవిన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లి నియోజక వర్గ పరిధిలో ని పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ఇవిఎమ్ యూనిట్స్ భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్, పోస్టల్ బ్యాలెట్ లు, స్టాట్యూటరీ మెటీరియల్ భద్రపరిచే క్రమంలో పక్క పక్కనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మే 13 పోలింగు ప్రక్రియ ముగిసిన అనంతరం ఇవిఎమ్ యూనిట్స్, స్టాట్యూటరీ మెటీరియల్ , పోస్టల్ బ్యాలెట్ పత్రాలు స్ట్రాంగ్ రూమ్ లకి భద్రపరచి అభ్యర్థుల, వారి ప్రతినిధుల సమక్షంలో సీల్ వేశామని అన్నారు. అదే విధంగా ఆ మూడు రూములకి కూడా డోర్, కిటికీ లను చెక్కలను కొట్టి మూసి ఉంచామన్నారు. ఓట్లు లెక్కించే జూన్ 4 వ తేదీ ఉదయం 5 గంటలకి అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ సమక్షంలో తెరవనున్నట్లు తెలిపారు. ఆలోగా తప్పనిసరిగా హాజరు కావాలని పరిశీలకులు వారి సమక్షంలో ఉదయం 5.30 గంటలకు కౌంటింగ్ సిబ్బంది టేబుల్ ఎలాట్ మెంట్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. స్ట్రాంగ్ ల వద్ద రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటినీ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణా చేస్తున్నట్లు తెలిపారు. అక్కడ అభ్యర్థులు, ఏజెంట్స్ నిరంతరం పరిశీలించడం జరుగుతుందనీ అన్నారు. శుక్రవారం నుంచి అభ్యర్థులు, ఏజెంట్స్ నేరుగా స్ట్రాంగ్ రూమ్ లను తనిఖీ చేసే అవకాశం ఉందని, ఆమేరకు పోలీసు, గెజిటెడ్ అధికారి ఎస్కార్ట్ తో పంపనున్నట్లు తెలియ చేశారు. మూడు షిఫ్ట్ లలో తహశీల్దార్లు ను నియమించినట్లు తెలిపారు. నియోజక వర్గం లో 3,033 పోస్టల్ బ్యాలెట్ పోలైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక కలెక్టరేట్ లో సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా సమావేశం గురువారం నిర్వహించారు. జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పోటీలో ఉన్న అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లు పాటించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించి వారికున్న సందేహాలను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నివత్తి చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను స్వేచ్ఛాయుతంగా అత్యంత పారదర్శకంగా నిర్వహించుటలో తమ వంతు సహకారం అందించాలని ఎన్నికల్లో పోటీ లో ఉన్న అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మొదటి ఘట్టం పోలింగ్ జిల్లా లో ప్రశాంతంగా ముగిసిందని అందుకు రాజకీయ పార్టీలు ప్రతినిధులు తమ వంతు సహకారం తోడ్పాటు అందించారన్నారు. అదే స్ఫూర్తిని ఓట్ల లెక్కింపు ప్రక్రియలో జిల్లా యంత్రాంగానికి అందించి కౌంటింగ్ ప్రక్రియను కూడా విజయవంతం చేయాలని కోరారు. ఇటీవల పోలింగ్ రోజున పోలింగ్ అనంతరం పలు జిల్లాలలో చోటు చేసుకున్న హింసాత్మక సంఘటన నేపథ్యంలో ఎన్నికల సంఘం భద్రత చర్యలను మరింత కట్టుదిట్టం చేసిందన్నారు. అటువంటి చర్యలు పునరావతం కాకుండా కౌంటింగ్ ప్రక్రియ సజావు గా జరగడానికి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కౌంటింగ్ ప్రక్రియ రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని చర్యలతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కౌంటింగ్ కొరకు ఎటువంటి ఫిర్యాదులు లేని సమర్ధవంతమైన అధికార సిబ్బందిని నియమించామన్నారు. సిస్టం సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ఇవిఎంలు ద్వారా కౌంటింగ్‌లో పెద్దగా సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు లేవన్నారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు కౌంటింగ్ సిబ్బందికి రెండు దఫాలుగా శిక్షణ కార్యక్రమాలు ర్యాండమైజేషన్ ప్రక్రియతో విధులు కేటాయించామన్నారు. కౌంటింగ్ రోజున ఉదయం ఏడు గంటలకే స్ట్రాంగ్ రూములను కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో తెరుస్తామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6:30 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు సంతప్తి చెందిన తరువాతనే తదుపరి ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఇవిఎంల్లో నిక్షిప్తమై ఉన్న అభ్యర్థుల భవితవ్యాన్ని స్వయంగా పరిశీలించుకునేందుకు అభ్యర్థులు కూడా హాజరుకావాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పారదర్శకంగా పనిచేస్తున్నది లేనిదీ కేవలం పోటీలో ఉన్న అభ్యర్థి పరిశీలించు కునే అవకాశం లేనందున ఆయన తరపున ఏజెంట్లు స్వయంగా పరిశీ లించుకోవాలన్నారు. కౌంటింగ్ సిబ్బందిని 25శాతం రిజర్వులో ఉంచామనిస్పష్టం చేశారు. ప్రాధాన్యత క్రమంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వారీగా కౌంటింగ్ ఏజెంట్లకు సిట్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఏజెంట్లు ప్రతి రౌండు నివేదికలో తప్పనిసరిగా సంతకాలు చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి పోస్టల్ బ్యాలెట్ , సర్వీస్ ఓటర్ల ఓట్ల లెక్కింపు సంబంధించి రెండు చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. వీటిలో ఒక టేబుల్ పోస్టల్ బ్యాలెట్ కొరకు రెండవది సర్వీస్ ఓటర్ల కొరకు ఏర్పాటు చేస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ సర్వీస్ ఓటర్లు, ఇవిఎంల్లో ఓట్లు లెక్కింపు సమాంతరంగా జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు ఇదే సరళిలో పార్లమెంట్ నియోజకవర్గానికి 14 టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓటర్ల ఓటింగ్ లెక్కింపు కొరకు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి టేబుల్ కు రౌండ్ కు 500 ఓట్లు చొప్పున పోస్టల్ బ్యాలెట్ లెక్కించే విధంగా ఏర్పాటు చేశామన్నా రు ఒక టేబుల్ కు కేటాయించిన ఏజెంట్ మరో టేబుల్ లోని వివరాలు సేకరణకు ప్రయత్నించ రాదన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఆర్‌ఒతో పాటు సహాయ రిటర్నింగ్ అధికారి, సూక్ష్మ పరిశీలకులు, గెజిటెడ్ స్థాయి సూపరింటెండెంట్ వారికి సహాయ కులుగా విఆర్‌ఒలు ఉంటారన్నారు. ఇసిఐ మార్గదర్శకాల ప్రకారం ఒక సైడుగా ఏ పని జరగదని అంతా అత్యంత పారదర్శకంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో సిబ్బంది తప్పిదాలు చేస్తే ఎన్నికల సంఘం తీసుకుని చర్యలు, శిక్షలు చాలా కఠినంగా ఉంటాయన్నారు. కౌంటింగ్ నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా 819 సర్వీస్ ఓటర్లు ఉండగా వీరిలో ఇప్పటివరకు 262 మంది సర్వీస్ ఓట్లు వినియోగించుకు న్నారన్నారు. మిగిలినవారు విని యోగించుకునే సమయం ఇంకా ఉందన్నారు. యువత ఎన్నికల ప్రక్రియలో హింసాత్మక సంఘటన లకు పాల్పడి తమ భవిష్యత్తును అంధకారం చేసుకోరాదని ఆయన సందర్భంగా హితవు పలికారు.

జిల్లా ఎస్పి ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి మొదటి ఘట్టం పోలింగ్ ప్రక్రియ సజావుగా జరగడానికి ఒకవైపు తీసుకున్న ముందస్తు జాగ్రత్తచర్యలు తోపాటు గా మరోవైపు రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్యర్థులు మంచి సహకారం అందించారన్నారు. ఇదే పంథాను, స్ఫూర్తిని కౌంటింగ్ ప్రక్రియ లోను కొనసాగించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను ముగించడానికి తోడ్పాటునందించాలని కోరారు. స్ట్రాంగ్ రూములో వద్ద సెక్యూరిటీ పరంగా సెంట్రల్ పారా మిలటరీ దళాలు ఆయుధాలతో సహా భద్రత కల్పిస్తున్నాయన్నారు. రెండో దశలో రాష్ట్ర ఆర్మ్‌డ్ పోలీస్ బలగాలు మూడో దశలో సివిల్ పోలీసులు మూడంచెల భద్రత కల్పిస్తారన్నారు. కౌంటింగ్ సెంటర్ కి వచ్చే వాహనాల ను చెక్ చేసి అనుమతిస్తామన్నారు. ఇసిఐ మార్గదర్శ కాలు ప్రకారం అత్యంత భద్రతను పాటిస్తున్నట్లు వెల్లడించారు. ఫలితాలు అనంతరం గెలుపొందిన అభ్యర్థుల విజయోత్సవ ర్యాలీలు ఊరేగింపులు పూర్తిగా నిషేధమని ఆయన స్పష్టం చేశారు అదేవిధంగా బాణసంచా కాల్పులు, లూజు పెట్రోల్ అమ్మకాలు పై నిషేధం ఉం దన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోనికి ధ్రువీకరించబడిన పాస్లు జారీ చేసిన కౌంటింగ్ ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామన్నారు. కళాశాల చుట్టుపక్కల స్టెరైన్ జోన్‌గా ప్రకటించామన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని ఎవరు గుంపులుగా గుమిగూడ రాదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి ఈ మహత్తర కార్యక్రమా న్ని దిగ్విజయం చేయాలని ఆయన కోరారు. గతంలో పరిస్థితులు వేరని ప్రస్తుతం ఎన్నికల సంఘం నిర్ణయించిన మార్గదర్శకాలు అందుకు భిన్నంగా ఉన్నా యన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడి ఇబ్బందికర పరిస్థితులు సృష్టించేందుకై ఎవరు ప్రయత్నించరాదనిస్పష్టం చేశారు. ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు తీసుకున్నామని అన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద మీడియా సెంటర్ ను ఏర్పాటు చేసి రెగ్యులర్గా మానిటరింగ్ చేస్తామన్నారు. పలు సమస్యాత్మక ప్రాంతాల్లో నిత్యం నిఘా చర్యలు కొనసాగు తాయన్నారు. 214 సిసి కెమెరాలు ఏర్పాటుచేసి ప్రక్రియను చిత్రీకరిస్తామన్నారు. కౌంటింగ్ సందర్భంగా ప్రజలకు భరోసాను కల్పించేందుకై కవ్వింపు చర్యలు హింసాత్మక సంఘటనలకు పాల్పడ కుండా తమ వంతు సహకారం అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఏడు నియోజకవర్గాల ఆర్వోలు ప్రజా ప్రతిని ధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్‌పి ఎస్.శ్రీధర్